చాష్ట్ నమాజు

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా తెలియజేశారు, ఆదమ్ సంతానంలో ప్రతి ఒక్కరికీ తన లో సవ్యంగా ఉన్న ప్రతి ఒక్క ఎముక, ప్రతి ఒక్క కీలుకు బదులుగా సదఖాలు చేయవలసిన బాధ్యత ఉంది. కలిసిన వారికి సలామ్ చేయడం సదఖా. మంచిని ఆజ్ఞాపించడం సదఖా. చెడును ఆపడం సదఖా. నడిచేదారిలో ఇబ్బంది కలిగించే వాటిని తీసేయడం సదఖా. భార్య నోటికి అన్నం ముద్ద అందించడం సదఖా. వీటన్నింటికి రెండు రకాతులు చాష్ట్ నమాజు సరిపోతుంది (అబూదావూద్). చాష్ట్ సమయం సూర్యుడు ఉదయించిన పదినిముషాల తర్వాతి నుంచి జుహర్ అజాన్ కు ముందు వరకు ఉంటుంది. కనిష్టంగా రెండు రకాతులు గరిష్టంగా ఎనిమిది రకాతులు చదవవచ్చును. నాలుగు రకాతులు లేదా ఆరురకాతులు ఎన్నయినా చదవవచ్చు. రెండేసి రకాతుల చొప్పున చదవాలి.

ఇస్తిఖారా నమాజు: రెండు మంచిపనుల్లో ఏ పని చేయాలి? ఇలాంటి ఎటూతేలని పరిస్థితి ఎదురైతే, ఏం చేయాలన్నది తేల్చుకోలేని పరిస్థితి ఉంటే, అప్పుడు విశ్వాసి అల్లాహ్ వైపునకు మరలాలి. ఆయన నుంచి ఉత్తమమైన దారి లభిస్తుంది. అందుగ్గాను నమాజులో అల్లాహ్ సహాయాన్ని కోరుకుంటాడు. ఈ నమాజునే ఇస్తిఖారా నమాజు అంటారు. ఇది సున్నత్. ఇది రెండు రకాతుల నమాజు. నిర్ధారిత సమయం లేదు. ఇస్తిఖారా నమాజు తర్వాత చదవవలసిన ప్రత్యేక దువాలను ఇందులో చదువుతారు. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా రజిఅల్లాహు అన్హు ఇలా తెలియజేశారు, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ మా వ్యవహారాల్లో ఇస్తిఖారా చేయడం నేర్పేవారు, దివ్యఖుర్ఆన్ను నేర్పినట్లే ఆయన ఇది కూడా నేర్పేవారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా అన్నారు, మీరేదైనా పని చేయాలని సంకల్పిస్తే రెండు రకాతులు నఫీల్ చదువుకుని, ఈ దువా చేయండి:

«اللَّهُمَّ إِنِّي أَسْتَخِيرُكَ بِعِلْمِكَ وَأَسْتَقْدِرُكَ بِقُدْرَتِكَ، وَأَسْأَلُكَ مِنْ فَضْلِكَ العَظِيمِ، فَإِنَّكَ تَقْدِرُ وَلاَ أَقْدِرُ، وَتَعْلَمُ وَلاَ أَعْلَمُ، وَأَنْتَ عَلَّامُ الغُيُوبِ، اللَّهُمَّ إِنْ كُنْتَ تَعْلَمُ أَنَّ هَذَا الأَمْرَ خَيْرٌ لِي فِي دِينِي وَمَعَاشِي وَعَاقِبَةِ أَمْرِي - أَوْ قَالَ عَاجِلِ أَمْرِي وَآجِلِهِ - فَاقْدُرْهُ لِي وَيَسِّرْهُ لِي، ثُمَّ بَارِكْ لِي فِيهِ، وَإِنْ كُنْتَ تَعْلَمُ أَنَّ هَذَا الأَمْرَ شَرٌّ لِي فِي دِينِي وَمَعَاشِي وَعَاقِبَةِ أَمْرِي - أَوْ قَالَ فِي عَاجِلِ أَمْرِي وَآجِلِهِ - فَاصْرِفْهُ عَنِّي وَاصْرِفْنِي عَنْهُ، وَاقْدُرْ لِي الخَيْرَ حَيْثُ كَانَ، ثُمَّ أَرْضِنِي»

అనువాదం:

"అల్లాహ్, నేను నీ జ్ఞానం ద్వారా నీ నుంచి మేలును కోరుతున్నాను. నీ శక్తిసామర్థ్యాల ద్వారా శక్తిసామర్థ్యాలు కోరుతున్నాను. నీ అత్యున్నత అనుగ్రహాలను కోరుతున్నాను. నీవే అన్నింటినై శక్తి కలిగినవాడవు. నాకు శక్తి లేదు. నీవు తెలిసినవాడవు. నాకు జ్ఞానం లేదు.

నీవే అగోచరమైన పనులను కూడా తెలిసిన వాడవు. అల్లాహ్, నీ జ్ఞానపరిధిలో నాకు (ఫలానాపని), నా ధర్మం, నా ఆర్థికం, నా ఫలితాలలో ఉత్తమమైన దానిని నాకు ప్రసాదించు. నాకు అది తేలికయ్యేలా చేయి. అందులో నాకు మేలు కలిగించు. నీ జ్ఞానపరిధిలో నాకు ఈ పని, నాకొరకు, నా ధర్మం, నా ఆర్థికం, నా ఫలితాల విషయంలో మంచిది కానట్లయితే దీన్ని నా నుంచి, నన్ను దీని నుంచి దూరం చేయి. నాకు ఎక్కడ మేలు ఉందో అది ప్రసాదించు. దానిపై నేను సంతృప్తి చెందేలా చేయి." (బుఖారీ)

సలాతుల్ హాజత (ఏదన్నా అవసర సమయంలో చేసే నమాజు)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీ ఔఫీ రజిఅల్లాహు అన్హు ఇలా తెలియజేశారు, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ మా వైపునకు వచ్చినప్పుడు మమ్మల్ని చూసి, మీలో ఎవరికైనా అల్లాహ్ నుంచి ఏదన్నా అవసరం పడితే, లేదా వేరే మనిషి నుంచి ఏదన్నా అవసరం పడితే, ఆ వ్యక్తి చక్కగా వుజు చేసుకుని, రెండు రకాతుల నమాజు చదువుకోవాలి, ఆ తర్వాత అల్లాహ్ స్తోత్రం చేయాలి. ప్రవక్తపై దరూద్ పంపాలి, పిదప ఈ దువా చదవాలి అన్నారు:

لاَ اِلَہ اِلاَّ اللہُ الحلیمُ الکریمُ سبُحَانَ اللہِ رَبِّ العَرشِ العَظیمِ الحمدُ للہِ رَبِّ العَا لِمین اَسأَلُكَ موجباتِ رَحمَتکَ وَعَزَائِمَ مَغفِرَتَک وَالعِصمَۃ مِن کُل ذَنبٍ وَالغَنِیمَۃِ مِن کُل بِرٍّ وَالسَّلَامَۃِ مِن کُلِّ اِثمٍ لاَ تَدعَ لَنَا ذَنباً اِلاَّ غَفَرتَہ وَ لاَغَماا ِلاَّ فَرَّجتَہ وَلَا حَا جَۃً ھِیَ لک رضاً اِلاَّ قَضَیتَھَا یاَ اَرحَم الرَّاحِمِین

ఈ దువా తర్వాత ఇహపరలోకాలకు సంబంధించి ఏది కోరుకోవాలన్న కోరుకోవాలి. నిస్సందేహంగా అల్లాహ్ అన్నింటిపై ఆధిపత్యం ఉన్నవాడు.

దువా అనువాదం: అల్లాహ్ తప్ప ఆరాధ్యుడెవరూ లేడు. ఆయన అత్యున్నతుడు, కరుణామయుడు. అత్యున్నత సింహాసనానికి యజమాని పవిత్రుడైన అల్లాహ్. స్తోత్రాలన్నీ అల్లాహ్ కే. ప్రపంచాల ప్రభువు ఆయనే. అల్లాహ్, నేను నీ కారుణ్యం, నీ మన్నింపు ప్రసాదించే పనులు చేయగలిగే సౌభాగ్యం కోరుతున్నాను. నీకు విధేయుడిగా ఉండే, ప్రతి పాపానికి దూరంగా ఉండే సౌభాగ్యం కోరుతున్నాను. నా పాపాలను క్షమించు. నా మనసులో ఉన్న గర్వాన్ని తొలగించు. నీకు ఇష్టమైన నా ప్రతి అవసరాన్ని పూర్తి చేయి. అత్యధికంగా కరుణించేవాడా, నా వేడుకోలు స్వీకరించు. (తిర్మిజి, నిసాయీ, ఇబ్నె మాజ)

సలాతుత్తౌబ :

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వస్లమ్ ఇలా తెలియజేశారు:

«مَا مِنْ عَبْدٍ يُذْنِبُ ذَنْبًا، فَيُحْسِنُ الطُّهُورَ، ثُمَّ يَقُومُ فَيُصَلِّي رَكْعَتَيْنِ، ثُمَّ يَسْتَغْفِرُ اللَّهَ، إِلَّا غَفَرَ اللَّهُ لَهُ»

అనువాదం:

ఎవరైనా పాపం చేస్తే, అతను చక్కగా వుజు చేసుకుని, రెండు రకాతులు నమాజు చదవాలి. అల్లాహ్ తో తన పాపానికి మన్నింపు ప్రార్థన చేయాలి. అల్లాహ్ అతడిని క్షమిస్తాడు. (అహ్మద్, అస్ హాబుస్సునన్, ఇబ్నేమాజ)

సలాతుల్ కసూఫ్ (సూర్యగ్రహణం నమాజు):

హజ్రత్ ఆయేషా రజిఅల్లాహు అన్హా ప్రకారం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ జీవితకాలంలో ఒకసారి సూర్యగ్రహణం వచ్చింది. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ మస్జిదుకు వెళ్ళారు. ఆయన తక్బీర్ పలికారు. ప్రజలు ఆయన వెనుక పంక్తులు తీరారు. ఆయన నమాజులో సుదీర్ఘంగా దివ్యఖుర్ఆన్ పారాయణం చేశారు. తర్వాత రుకు కూడా ఖుర్ఆన్ పారాయణం చేసినంత సేపు చేశారు. తర్వాత పైకి లేస్తూ సమిఅల్లాహులిమన్ హమిద, రబ్బనా లకల్ హమ్ద్ అంటూ లేచి నిలబడ్డారు. మళ్ళీ మొదటిసారి మాదిరిగా సుదీర్ఘంగా దివ్యఖుర్ఆన్ పారాయణం చేశారు. తర్వాత తక్బీర్ పలికి మొదటిసారి మాదిరిగానే రుకు చేశారు. సమీఅల్లాహులిమన్ హమిద, రబ్బనా వలకల్ హమ్ద్ అంటూ సజ్దా చేశారు. రెండవ రకాతులోను మొదటి రకాతు మాదిరిగానే చేశారు. ఇలా రెండు రకాతుల్లోను ఆయన నాలుగు సార్లు ఖియామ్, నాలుగు సార్లు రుకు, నాలుగు సజ్దాలు చేశారు. నమాజుకు ముగియక ముందే గ్రహణం వీడిపోయింది. ఆ తర్వాత ఆయన ఖుత్బా (ప్రసంగం) చేశారు. అల్లాహ్ స్తోత్రపాఠాలతో ప్రారంభించి, సూర్యచంద్రులు రెండు అల్లాహ్ చిహ్నాలు, ఎవరైనా మరణించడం వల్ల లేదా పుట్టడం వల్ల గ్రహణాలు రావు. వాటిని ఇలాంటి పరిస్థితిలో (గ్రహణం స్థితిలో) చూస్తే వెంటనే నమాజు చేయండి అన్నారు.

ఈ నమాజు సున్నత్ ముఅక్కిదా. సూర్యచంద్ర గ్రహణాల సందర్భంగా రెండు రకాతులు చదువుతారు. ప్రతి రకాతులోను రెండు ఖియాములు, రెండు రుకులు ఉంటాయి. మస్జిదులో సామూహికంగా చేయాలి. దివ్యఖుర్ఆన్ పారాయణం సుదీర్ఘంగా చేయడం ఉత్తమం. గ్రహణం ప్రారంభమైనప్పుడు ఈ నమాజు చదవాలి. గ్రహణం ముగిసేవరకు చదువుతారు.

నమాజ్ ఇస్తిస్ఖా:

ఇది సున్నతె ముఅక్కిదా. వర్షం కోసం చదువుతారు. ఒకసారి ప్రజలు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ వద్ద అనావృష్టి గురించి ప్రస్తావించారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ మింబరుపైకెక్కి అల్లాహ్ స్తోత్రపాఠం చేసి, మీరు అనావృష్టి గురించి చెప్పారు, అల్లహ్ తో వర్షం కోసం దువా చేయండి ఆయన మీ దువా స్వీకరిస్తానని చెప్పాడన్నారు. ఇంకా ఆయన ఇలా అన్నారు:

www.uzairfalahi.com

الحمد لله رب العالمين الرحمن الرحيم مالک يوم الدين لا الہ الا الله يَفعَلُ مَا يُرِيدُ اللهُمَّ لاَ اِلَہَ اِلاَّ اَنتَ، اَنتَ الغَنِّیُ وَنَحنُ الفُقَرَاء اِنزِل عَلَينَا الغَيثَ وَاجعَل مَا اَنزَلتَ عَلَيَنَا قُوَّة وَبَلاغًا اِلَی حِين

"అల్ హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. అర్రహమా నిర్రహీమి మలికి యౌమిద్దీన్. లాయిలాహ ఇల్లల్లాహు యఫ్ అలు మార యురీదు, అల్లాహుమ్మ అంతల్లాహు, లా యిలాహ ఇల్లా, అంతల్ గనియ్యు, వ నహ్ నుల్ ఫఖరాఉ, అన్ జిల్ అలైనల్ గైస, వజ్ అలమ్ మా అన్ జల్ త, లనా ఖువ్వత, వ బలాగన్ ఇలాహీన్."

ఆ తర్వాత ఆయన తన రెండు చేతులు పైకెత్తి దువా చేయడం ప్రారంభించారు. ఆయన రెండు చేతులను చంకలు కూడా కనిపించేలా పైకెత్తి దువా చేశారు. ఆ తర్వాత ఆయన అటుతిరిగారు, ప్రజలవైపు వీపుపెట్టి తన దుప్పటి తిప్పి వేసుకున్నారు. ప్రజలవైపు తిరిగి, మింబరు నుంచి కిందికి దిగారు. రెండు రకాతుల నమాజు చేయించారు. అంతలోనే మబ్బులు కమ్మాయి. ఉరుములు ఉరిమాయి. మెరుపులు మెరిశాయి. అల్లాహ్ ఆజ్ఞతో కుండపోతగా వర్షం కురిసింది. మస్జిదు నుంచి వెనక్కి వస్తున్నప్పుడు దారుల్లో నీళ్ళు ప్రవహించసాగాయి. ప్రజలు వర్షం నుంచి కాపాడుకోడానికి గబగబ ఇండ్లవైపు పరుగెత్తడం చూసి ఆయన నవ్వుకున్నారు. ఆయన గెడ్డం నుంచి దంతాలు బయటకు కనబడేలా నవ్వారు. ఆయన ఇలా అన్నారు, అల్లాహ్ అన్నింటిపై శక్తి కలిగినవాడని నేను సాక్ష్యమిస్తున్నాను అన్నారు. నేను అల్లాహ్ దాసుడను, సందేశహరుడిని మాత్రమే అని సాక్ష్యమిస్తున్నానని చెప్పారు. (అబూదావూద్, హాకిమ్)

ఈ నమాజు రెండు రకాతులు చదువుతారు. ఈద్ నమాజుల మాదిరిగా. ఇందులో తక్బీరులు కూడా ఉంటాయి. ఖిరాత్ కూడా బిగ్గరగా చదువుతారు. ప్రజావాసాలకు బయట మైదానంలో చదువుతారు. నమాజు తర్వాత ఇమాము మింబరుపై ఖుత్బా చేసే బదులు నేలపైనే నిలబడి ఖుత్బా ఇస్తారు. ఖుత్బాలో అల్లాహ్ ను స్తుతిస్తారు. అత్యధికంగా ఇస్తిగ్ ఫార్ చేస్తారు. ప్రజలకు హితబోధ చేస్తారు. వారి బలహీనతలనుంచి నిరోధిస్తాడు. మోసాలు చేయరాదని చెబుతాడు. దైవం పట్ల అవిధేయత, మన పాపాల కారణంగానే ఈ విపత్తు వచ్చిందని గుర్తు చేస్తాడు. పాపాలను మన్నింపుకు అల్లాహ్ ను ప్రార్థిస్తాడు. వర్షం కురిపించాలని వేడుకుంటాడు. ఈ ప్రసంగం కన్నా ముందే ప్రజలు తమ పాపాలకు పశ్చాత్తాపం (తౌబ) చేసుకోవాలి. ఇతరుల హక్కులను చెల్లించాలి. వివాదాలు, జగడాలన్ని మానుకుని సమైక్యత, సోదరభావాలు పెంచుకోవాలి. మంచి పనులు అత్యధికంగా చేయాలి. ఉదాహరణకు సదఖాలు, దానధర్మాలు, ఉపవాసాలు వగైరా.

నమాజు కోసం కాలినడకన వెళ్ళాలి. వినమ్రంగా, విధేయంగా వెళ్ళాలి. వెంట పిల్లలు, వృద్ధులు కూడా ఉండాలి. ఇంటిలో ఉండే ముసలి మహిళలు చివరకు పశువులు కూడా వెంట ఉండడం మంచిది. అత్యధికంగా గద్గదంగా ప్రార్థించాలి. తద్వారా అల్లాహ్ కారుణ్యం మరింతగా కురిసే అవకాశం ఉంది. భుజాలపై కప్పుకున్న దుప్పట్లను తిప్పి వేయాలి. కుడి

ఎడమలు మార్చుకోవాలి. అలాగే పై బాగాన్ని కిందికి, కింది భాగాన్ని పైకి వచ్చేలా మార్చి వేసుకోవాలి. ఇది కేవలం పురుషులకు మాత్రమే. స్త్రీలే చేయనవసరం లేదు.

ఇతర నఫీల్ నమాజులు:

1. తహియ్యతుల్ మస్జిద్
2. వుజు తర్వాత రెండు రకాతులు
3. ప్రయాణానికి బయలుదేరే ముందు రెండు రకాతులు
4. ప్రయాణం నుంచి వచ్చిన తర్వాత రెండు రకాతులు

ఇంట చదివే నఫీల్ నమాజులు:

నమాజులు సామూహికంగా (జమాఅత్ తో) చదవాలని, మస్జిదుల్లో చదవాలని ఇస్లామ్ బోధిస్తుంది. అయితే దానితో పాటు ఇండ్లను కూడా నమాజులతో తేజోవంతం చేయాలన్న బోధనలు కూడా ఉన్నాయి. ఆ విధంగా ఒక విశ్వాసి పరిసరాలన్ని ప్రశాంతత, మనోశాంతులతో కళకళలాడతాయి. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా అన్నారు:

«إِذَا قَضَى أَحَدُكُمُ الصَّلَاةَ فِي مَسْجِدِهِ، فَلْيَجْعَلْ لِبَيْتِهِ نَصِيبًا مِنْ صَلَاتِهِ، فَإِنَّ اللهَ جَاعِلٌ فِي بَيْتِهِ مِنْ صَلَاتِهِ خَيْرًا»

అనువాదం:

మీలో ఎవరైనా మస్జిదులో నమాజు చదువుతున్నప్పుడు ఇంటిని మరిచిపోరాదు. ఎందుకంటే నమాజు ద్వారా అల్లాహ్ ఇండ్లలో మేలు, శ్రేయం ప్రసాదిస్తాడు (ముస్లిమ్, అహ్మద్)

మరో చోట ఇలా సెలవిచ్చారు:

«اجْعَلُوا مِنْ صَلَاتِكُمْ فِي بُيُوتِكُمْ, وَلَا تَتَّخِذُوهَا قُبُورًا»

అనువాదం:

"మీ నమాజుల్లో కొన్ని ఇండ్లలో కూడా చదవండి. ఇండ్లను స్మశానాలుగా మార్చకండి." (ముత్తఫికున్ అలైహ్)

* * *

www.uzairfalahi.com